క్లుప్తంగా

ఏపీఎంగా రామాంజనేయులు బాధ్యతల స్వీకరణ



ఏపీఎం రామాంజనేయులు, సిబ్బందిని సన్మానిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని వెలుగుశాఖ ఏపీఎంగా ఎస్.రామాంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన దేవీపట్నం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన ఆదినారాయణ చింతూరు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కాగా శుక్రవారం వెలుగు కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారిలో క్లస్టర్ కో–ఆర్డినేటర్లు (సీసీలు) రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, కళ్యాణచక్రవర్తిలతో పాటు హెచ్‌డీ సీసీ లింగమ్మ, ఎఫ్‌పీఓ సీసీ సుధాకర్ కూడా ఉన్నారు. కొత్తగా కొలువుతీరిన, బదిలీపై వెళ్తున్న వారిని గ్రామ సమాఖ్య వీఓఏలు ఘనంగా సన్మానించారు. ఆఫీస్ సబార్డినేటర్ రాజశేఖర్, వీఓఏలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాజవొమ్మంగి తహసీల్దార్‌గా సూర్యారావు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి తహసీల్దార్‌గా కె.సూర్యారావును నియమిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు కార్యాలయ వర్గాలు తెలియజేశాయి. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కరక సత్యనారాయణ దేవీపట్నం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. రాజవొమ్మంగి డిప్యూటీ తహసీల్దార్‌గా బాలాజీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ డీటీగా పనిచేసిన అల్లు సత్యనారాయణ రంపచోడవరం తహసీల్దార్‌గా (ఎఫ్ఏసీ)గా నియమితులయ్యారు.

పంచాయతీకి ట్యాంకర్ వితరణ



తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎటపాక: మండల కేంద్రం ఎటపాక గ్రామపంచాయతీకి తాగునీటి సమస్యను నివారించేందుకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకర్‌ను వితరణగా అందజేశారు. ట్యాంకర్ కొనుగోలుకు సహకరించాలని సర్పంచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి పద్మావతి ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజును కోరగా ఆయన స్పందించి రూ 1.25లక్షలు అందజేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరరావు, సీఐ కన్నపరాజు చేతులమీదుగా ట్యాంకర్ ప్రారంభించారు. శ్రీనివాసరావు, చలపతి, ఫౌండేషన్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



సంతలో వ్యాపారులకు సూచనలిస్తున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో రోడ్డుపై విక్రయాలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.పాపినాయుడు చెప్పారు. ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి వారపు సంతను పరిశీలించారు. సంత జరిగే ప్రాంతం హైవేకు ఆనుకొని ఉండడంతో ఈ రహదారిలో నిత్యం వాహనల రద్దీ దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వ్యాపారులకు సూచనలిచ్చారు. రోడ్డుపై దుకాణాలు ఏర్పాటుచేయవద్దని, ఆటో డ్రైవర్లు పార్కింగ్ స్థలంలోని వాహనాలు ఉంచాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అందరూ సహకరించాలని కోరారు.

బాలారంలో బైక్ చోరీ

కొయ్యూరు: మండలంలో బైక్ దొంగతనాలు మళ్లీ మొదలయ్యాయి...తాజాగా బాలారంకు చెందిన మొండెం రాజు పల్సర్ బైక్ చోరికి గురైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. రాత్రి రామాలయం వద్ద పార్కింగ్ చేసి తెల్లవారుజామున చూస్తే బైక్ లేదన్నారు. దీనిపై అనేక చోట్ల స్నేహితులకు తెలిపినా బైక్ ఆచూకీ తెలియలేదన్నారు. ఇదిలా ఉంటే కొద్ది కాలంగా నిలిచపోయిన బైక్ దొంగతనాలు తిరిగి ప్రారంభం కావడంతో వాహనదారులు భయపడుతున్నారు. గతంలో చోరికి గురైన వాహనాల్లో ఎక్కువగా పల్సర్ బైక్‌లున్నాయి.

వరికి తెగుళ్లు.. రైతన్నకు కన్నీళ్లు

- వరిపై పురుగుల ముప్పేట దాడి
- గణనీయంగా తగ్గుతున్న దిగుబడి
- ఆందోళనలో అన్నదాత



ఎర్రతెగులు సోకిన వరిపైరు

రాజవొమ్మంగి: ప్రస్తుత సీజన్‌లో వరి పైరుకు తెగుళ్ల బెడద వెంటాడుతోంది. వాతావరణంలో మార్పులు రావడంతో పంటకు పురుగు సోకుతోంది. నాట్లు వేసింది మొదలు మన్యంలోని వరి రైతుకు ఏటా ఏదో విధంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో మార్పుల కారణంగా ఖరీఫ్ వరిపై తెగుళ్ల ముప్పేట దాడి చేస్తున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాకపోవడంతో పంట దిగుబడి గణనీయంగా పడిపోతుందేమోనన్న ఆందోళన రైతులను పట్టి పీడిస్తోంది. రాజవొమ్మంగి మండలానికి చెంది ఈ ఏడాది 5,800 ఎకరాల్లో వరి సాగవుతోంది. నాట్లు వేసి 50 నుంచి 60 రోజులు పూర్తికాస్తోంది. ఇప్పుడిప్పుడే తెగుళ్ళు కూడా పొడచూపుతున్నాయి. ముఖ్యంగా వైరస్ తెగులు వచ్చి ఆకులు ఎర్రగా మారిపోయి, ఎదుగుదల ఆగిపోయిందని మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన రైతు తోలాటి బుజ్జి వాపోయాడు. స్థానిక వ్యవసాయాధికారులు సూచించిన పొడి మందు నీటిలో కలిపి పిచికారీ చేసినా తెగులు అదుపులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తెగులు వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పురుగుమందుల పిచికారీకు అధిక వ్యయం చేస్తు ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమ్ము, నాట్లు మొదలు మొదలు రసాయన ఎరువులు, పురుగుమందుల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, కనీస గిట్టుబాటు ధరలు రావడం లేదని వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తెగుళ్ల బెడదతో పూర్తిగా నష్టపోతున్నామని కన్నీరుమున్నీరవుతున్నారు. పంటను తెగుళ్ల బెడద నుంచి రక్షణ పొందేందుకు మండల వ్యవసాయాధికారి (ఏవో) రమేష్‌నాయుడు పలు సూచనలిచ్చారు.



తెగులను అరికట్టేందుకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

అప్రమత్తంగా ఉండాలి: ఏవో రమేష్‌నాయుడు



ఏవో రమేష్‌నాయుడు

వరి పంటకు సోకుతున్న తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఏవో రమేష్‌నాయుడు చెప్పారు. ప్రస్తుతం వరిపై కాండం కుళ్ళు తెగులు (ఆకులు, మొక్కలు ఎర్రగా మారిపోవడం) కనిపిస్తోంది. శిలీంద్రం వల్ల ఈ తెగులు వస్తుంది. ఈ తెగులు నివారణకు హెక్సాకొనోజోల్ 2.0 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటితో కలిపి ఎకరాకు 10 ట్యాంకుల మందు పిచికారీ చేసుకోవాలి. అగ్గితెగులు ట్రైసైక్లోజోల్ 6 గ్రాములు పొడి మందు ఒక లీటరు నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేయాలి. ప్రస్తుతం ఆకుముడత తెగుళ్ల బెడద ఉంది. దీని నివారణకు ప్రొఫెనోఫాస్ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాముల మందు ఒక లీటరు నీటిలో కలిపి పంట అంతా తడిసేలా పిచికారీ చేయాలి. రైతులు వ్యవసాయ సలహాలు, సూచనల కోసం సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించవచ్చు.

జిల్లేడు కషాయంతో పంటకు మేలు

ఖరీఫ్ వరి పంటకు పొటాష్ లోపాన్ని అధిగమించేందుకు 20 కిలోల జిల్లేడు ఆకులు, 200 లీటర్ల నీరు, 10 లీటర్ల ఆవు మూత్రం అన్ని కలిపి మూడు రోజుల పాటు మురగబెట్టాలి. ఆ ద్రావణానికి 10 లీటర్లకు వంద లీటర్ల నీరు కలిపి వరి చేనుపై పిచికారీ చేసుకోవాలి. రసం పీల్చే పురుగు నివారణకు ఈ ద్రావణాన్ని వినియోగించవచ్చు.

– అప్పలరాజు, ఎంసీఆర్పీ, ఏపీ సాధికార సంస్థ, రాజవొమ్మంగి

గిట్టుబాటు రావడం లేదు



దమ్ము, నాట్లు మొదలు మొదలు రసాయన ఎరువులు, పురుగుమందుల కోసం ఇప్పటికే ఎకరాకు రూ. 18వేలు ఖర్చు అయింది. పంట పక్వానికి వచ్చి కోతలు పూర్తయ్యే సమయానికి మరో రూ. 18వేలకు పైగ పెట్టుబడి తప్పడం లేదు. ఈ విధంగా నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంటకు చివరాఖరుకు రూ. 10వేలు కూడా మిగలడం లేదు. రోజు వారి కూలీ కూడా రైతుకు గిట్టుబాటు కావడం లేదు.

– బుజ్జి, రైతు, రాజవొమ్మంగి

అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి జాన్‌రాజ్

రాజవొమ్మంగి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో మండల ప్రత్యేకాధికారి జాన్‌రాజ్ శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ (ఆర్‌డబ్ల్యూఎస్), గృహ నిర్మాణశాఖ, నాడు–నేడు (గిరిజన సంక్షేమశాఖ) ఇంజినీర్లతో మట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ–క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం చెరకుంపాలెంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వర్రావు తదితరులున్నారు.

ఆత్మీయ సన్మానం



ఎఫ్ఆర్‌వో విజయలక్ష్మిని సన్మానిస్తున్న సిబ్బంది

కూనవరం: స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఫారెస్టు రేంజర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న (ఎఫ్ఆర్‌వో) మోహిని విజయలక్ష్మిని సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం జరిగిన వీడ్కోలు సభలో ఆమెను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వాహణలో తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్‌వో పి.అనిల్, ఎఫ్ఎస్ఓలు సాయి, ప్రసన్నకుమార్, శంకర్ రెడ్డి, ఎఫ్‌బిఓ జంపన్నరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోలింగ్ వాటర్ ట్యాంకుల పంపిణీ



రోలింగ్ వాటర్ ట్యాంకులను పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కొయ్యూరు: గిరిజన మహిళలకు తలపై పెట్టుకు మోసే నీటి బిందెలకు బదులుగా రోలింగ్ ద్వారా నీటిని తీసుకువచ్చే 40 లీటర్ల సామర్థ్యం కలిగిన రోలింగ్ నీటి ట్యాంకులను సీఫా స్వచ్ఛంద సంస్థ, ఎస్ఎన్ఎఫ్ ప్రేవేటు లిమిటెడ్, రోటరీ ఇంటర్నేషనల్–3020 సంస్థలు సంయుక్తంగా అందజేశాయి. మండలంలోని అల్లువియ్యపాలెం, కొండసంత, డొనురు ప్రాంతాల్లోని సుమారు 200లకు పైగా గిరిజన మహిళలకు రోలింగ్ వాటర్ ట్యాంకులను ఆయా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ రాజేంద్రన్ కుమారేషన్ మాట్లాడుతూ కొండలపై నుంచి గిరిజన మహిళలు తలపై బిందెలతో నీటిని తీసుకొని వస్తున్న ఇబ్బందులను గుర్తించేందుకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో పరిష్కారంగా తలపై బరువు లేకుండా నేరుగా నడచుకుని తీసుకువచ్చే విధంగా రోలింగ్ వాటర్ ట్యాంకులను తయారు చేశామన్నారు. వీటితో సునాయసంగా నీటిని తీసుకురావచ్చని, మోసే ఇబ్బందులు ఉండవన్నారు. ఈ రోలింగ్ ట్యాంకులను ముంబైలో తయారు చేయించి తీసుకువచ్చామన్నారు. ఒకో రోలింగ్ నీళ్ల ట్యాంకు ఖరీదు రూ.2500 దాటి ఉందన్నారు. వాటి కాలపరిమితి పది సంవత్సరాల వరకు ఉంటుందని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. రోటరీ ఇంటర్నేషనల్–3020 డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటరావు మాట్లాడుతూ మహిళలు పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ బి.వినయ్ గాంధీ, కార్యదర్శి బి.మణిమాల, చైన్ సీఎస్ఆర్ డీఎం రావు.బి.మధు, సీఫా సంస్థ స్కిల్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమలత, సత్యారావు

సాక్షి, పాడేరు: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం పాడేరు మండల కమిటీ అధ్యక్షురాలిగా తమర్బ నాగ వెంకట హేమలత ఎన్నికయ్యారు. పీఆర్‌టీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.వి.గిరి, శెట్టి అప్పలరాజు అధ్యక్షతన ఉపాధ్యాయుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాడేరు మండల నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా రేగం సత్యారావుతో పాటు మరికొంతమంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఎన్నికయ్యారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో డేవిడ్‌రాజ్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది



డీఈ రఘునాథరావునాయుడుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కూర్మారావు

సాక్షి,పాడేరు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డేవిడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం నుంచి ఆయన బదిలీపై వచ్చారు.బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోకు కార్యాలయం సిబ్బంది అంతా పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఇంతవరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సాయి నవీన్ కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు.

టీడబ్ల్యూ డీఈగా రఘునాథరావు నాయుడు

చింతపల్లి: గిరిజన సంక్షేమ శాఖ డిఈగా జి.రఘునాథరావు నాయుడు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన డీఈ చాణిక్యరావుకు గుమ్మలక్ష్మీపురం బదిలీ కావడంతో ఆయన స్థానంలో జీకేవీధి మండలం జేఈగా విధులు నిర్వహిస్తున్న రఘునాథరావు నాయుడుకు డీఈగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది, కాంట్రాక్టర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎక్సైజ్ సీఐగా కూర్మారావు

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ ఎక్సైజ్ సీఐగా కూర్మాశావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన సీఐ రాజు శ్రీకాకుళం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ సీఐగా పనిచేసిన కూర్మారావు ఇక్కడ విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఆరు వైన్ షాపులు మంజూరైనట్టు చెప్పారు. ఇందులో భాగంగా చింతపల్లి మండలంలో–మూడు, జీకే వీధిలో–రెండు, కొయ్యూరులో–ఒక షాపు మంజూరైందని, నిర్వహణకు 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 11న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహిస్తామని, షాపులు మంజూరు చేస్తామన్నారు. ఎస్ఐ కరుణప్రసాద్. కానిస్టేబుల్ నాయుడు, రమేష్‌లు ఉన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయం అధిపతిగా బిందు

చింతపల్లిలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధిపతిగా శెట్టి బిందు నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉద్యాన పరిశోధన స్థానం అధిపతిగా ఉన్న బి.శివకుమార్‌ను తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు బదిలీ చేశారు. ప్రస్తుతం ఉద్యాన శాస్త్రవేత్తగా ఉన్న శెట్టి బిందును పరిశోధన స్థానంలో అధిపతిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న శివకుమార్‌ను శాస్త్రవేత్తలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



దూసరపాములో గాయత్రిదేవిగా దుర్గాంబిక



డుంబ్రిగుడలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



పవనగిరి క్షేత్రంలో అమ్మవారికి పూజలు



కొయ్యూరులో హోమంలో పాల్గొన్న భక్తులు

అడ్డతీగల: శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని రెండవ రోజు పవనగిరి క్షేత్రంలోని గిరి దుర్గా భవాని అమ్మవారు గాయత్రీ అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి గాయత్రి అవతారం విశిష్టతను వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునుంచే భక్తులు దర్శనం కోసం అధిక సంఖ్యలో ఆలయం ఎదుట బారులు తీరారు. రాజవొమ్మంగి శివాలయం కొండపై వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఇందన రాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. జడ్డంగిలో తోట సూరిబాబు ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భవానీ మాలధారులు భజనలు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

కొయ్యూరు: స్థానిక దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు. భక్తులు తరలివచ్చారు. కొయ్యూరుకు చెందిన అనిసెట్టి చిరంజీవి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.భారీ సంఖ్యలో భవానీ మాలధారులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఎం.చక్రరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: దసరా వేడుకల సందర్భంగా అరుకు సంతబయలులో ఉన్న దుర్గాగుడి వద్ద అర్చకుడు సూరజ్ త్రివేది ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం లైటింగ్, మైక్ సెట్టింగ్‌లతో వచ్చే భక్తులకు అన్ని విధల పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని భక్తులు తరలిరావాలని అర్చకుడు త్రివేది కోరారు.

రహదారి మరమ్మతుకు వినతి



రైల్వే అధికారికి వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: రెండవ రైల్వే లైన్ పనుల వల్ల దెబ్బతిన్న రహదారులు, వంతెనలకు మరమ్మతు చేయాలని కోరుతూ కోరుతూ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ తదితరులు రైల్వే అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో బొండం పంచాయతీ పరిధిలో రెండవ రైల్వే లైన్ నిర్మాణ పనులు చేస్తుండడంతో భారీ లోడ్‌తో వాహనాల రాకపోకలతో గన్నెల జంక్షన్ నుంచి కరకవలస వరకు రహదారులు పాడయ్యాయని, పెద్ద పెద్ద గోతులతో నిండి ఉన్నాయని, తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని కోరారు. భారీ వాహనాలు తిరగడంతో స్థానికులు, వాహనాదారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. అధికారులు స్పందించకపోతే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. గిరిజన సంఘం నాయకులు బుజ్జిబాబు, జోషి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని జోషితను సన్మానిస్తున్న ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

ఎటపాక: మండల పరిధిలోని పాండురంగపురం గ్రామానికి చెందిన సున్నం జోషిత 2024 నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థిని జోషితను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను మాట్లాడుతూ ఆదివాసీ ఉద్యమ నేత సున్నం వెంకటరమణ పెద్ద కుమార్తె 2024 తొలిదశలోనే నీట్ ర్యాంకు సాధించి ఏజెన్సీకే గర్వకారణంగా నిలిచారన్నారు. విజయవాడలోని పిన్నమనేని సిద్దార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో సీటు సాధించటం అభినందనీయమన్నారు. వైద్య విద్యను పూర్తి చేసి ఆదివాసీ గ్రామాలకు వైద్య సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సంఘం నాయకులు రామకృష్ణ, రాజు, ప్రసాద్, కాంతారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు



కార్యదర్శి చంద్రకాత్, సర్వేయర్ శివదాస్‌లను సన్మానిస్తున్న సర్పంచ్ పార్తిమ్మ, సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలో గల జర్జుల సచివాలయంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి చంద్రకాత్, సర్వేయర్ శివదాస్‌లకు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు శుక్రవారం వీడ్కోల సభను నిర్వహించారు. సర్పంచ్ డి.పార్తిమ్మ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు బాధ్యతగా మెలగాలని సూచించారు. ప్రజలతో మమేకమవుతూ విధులు నిర్వహిస్తే తప్పక మంచి గుర్తింపు వస్తుందని, ఎక్కడ పనిచేసిన సేవ భావంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చంద్రకాత్, సర్వేయర్ శివదాస్‌లను శాలువా కప్పి సత్కరించారు. వారు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, సచివాలయ కన్వీనర్ జగన్నాథంపడాల్, గృహసారధులు చందర్‌రావు, లోక్‌నాథ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌కు వినతి



జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి: అల్లూరి జిల్లా ఆదివాసీ ఉద్యమ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌కు జెడ్పీటీసీ పి.బాలయ్య వినతిపత్రాన్ని అందజేశారు. పాడేరులో శుక్రవారం జరిగిన గ్రీవెన్స్‌లో వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ వినతి పత్రాన్ని అందజేసినట్టు ఆయన తెలిపారు. చింతపల్లిలోని ప్రధాన మార్గంలో ఉన్న ఆదివాసీ ఉద్యమ నాయకుల విగ్రహాలను హైవే ఏర్పాటు నిమిత్తం అధికారులు తొలగించారని వినతిలో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ కారణంగా వేరే ప్రాంతంలో విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరామన్నారు. భారత ఆదివా సీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు, వివిధ ప్రజా సంఘాల నేతలు వరలక్ష్మి, కృష్ణారావు, బూరుగులయ్య, తిరుపతి తదితరులున్నారు.